సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబ దేవస్థానంలో వైదిక కమిటీ

సీతమ్మధార: శ్రీఎరుకుమాంబ దేవస్థానంలో వైదిక కమిటీ ఏర్పాటు చేశామని ఆలయ ఈవో జీవీ రమాబాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు దేవస్థానంలో ముఖ్యమైన వైదిక కార్యక్రమాలు అనగా ఆచారాలు, సేవలను నిర్వహించే విధానం, యాగాల నిర్వహణ, కుంభాభిషేకాలు, ఇతర పండగల నిర్వహణకు ముహూర్తాల నిర్ణయం, కొత్త సేవలు, ఆచారాలను ప్రవేశపెట్టడం సహా అన్ని ముఖ్యమైన అంశాలకు సంబంధించి చర్యలు తీసుకుంటామన్నారు. కమిటీలో దేవస్థానం సీనియర్ అర్చకులు జి. శ్రీనివాసరావుని ముఖ్య అర్చక హోదాలో నియమించామని తెలిపారు.

10న భువనేశ్వరీదేవికి అధివాసం


భువనేశ్వరీదేవి


దాబాగార్డెన్స్: యాతపాలెంలో వెలసిన భువనేశ్వరీదేవి ఆరాధన పీఠంలో ఓం భువనేశ్వరి సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 10న శంఖంపువ్వు పత్రితో భువనేశ్వరీదేవికి అధివాస మహోత్సవం నిర్వహించనున్నట్టు పీఠం నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. ఆ రోజు ఉదయం అమ్మవారికి దివ్య పంచామృతాలతో పాటు కర్పూరాది సుగంధాలతో శాస్త్రోక్తంగా అర్చన కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకోవాలని మురళీకృష్ణ కోరారు.

సీపీ స్పెషల్ బ్రాంచ్ సందర్శన


రికార్డులు పరిశీలిస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ

అల్లిపురం: నగర స్పెషల్ బ్రాంచ్ కార్యాలయాన్ని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు, సిబ్బంది విధులను సమీక్షించి రికార్డులు పరిశీలించారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు అందజేశారు. పరిపాలనా పరమైన ఇబ్బందులను స్పెషల్ బ్రాంచ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అందుకు తగిన విధంగా ఆదేశాలు జారీ చేశారు.

షుగర్ వ్యాధి పట్ల అప్రమత్తం


కార్యక్రమానికి హాజరైన అతిథులు

మహారాణిపేట: ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఇండియా వార్షిక సదస్సులో భాగంగా గురువారం నోవాటెల్ హోటల్లో పీజీ వైద్య విద్యార్థులతో ప్రత్యేక సెషన్ నిర్వహించారు. ప్రముఖ ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ దిలీప్‌కుమార్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన థైరాయిడ్, ఎముకలు, ఎండోక్రైనాలజీ సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ వ్యాధులు సోకిన వారు నిత్యం మందులు వినియోగించాలన్నారు. డాక్టర్ ఇసికాన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.ఎ.వి. సుబ్రహ్మణ్యం, డాక్టర్ మైథిలీ, డాక్టర్ జయంతి రమేష్, డాక్టర్ పద్మలత, డాక్టర్ సంజయ్ ఘోష్, డాక్టర్ సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలు

కూరగాయల ధరలు ఆకాశానికి ఎగబాకుతున్నాయి. ఈరోజు కిలో రూ. 40 ఉన్న రేటు మర్నాటికల్లా రూ. 50, రూ. 60 అని వ్యాపారులు చెబుతుంటే అవాక్కవడం మన వంతవుతుంది. ఉల్లి, వంకాయలు, బీర, ఆనప, వెల్లుల్లి, బెండ, దొండ, క్యాలీఫ్లవర్, బంగాళాదుంపలు, కాకరకాయలు ఏవీ ఫర్వాలేదు కొనుక్కోవచ్చు అనిపించేలా లేవు. అన్నింటి ధరలు అధికంగానే ఉన్నాయి. కార్తీకమాసం కావడం, మాలధారులు పీఠాలు ఏర్పాటు చేసుకుని పూజలు చేస్తూ పూర్తి శాఖాహారమే తీసుకోవడం, అన్నసమారాధనల వంటి కారణాల వల్ల కూరగాయల ధరలు బాగా పెరిగాయి.

- ఆకాశాన్నంటుతున్న ధరలు
- విలవిల్లాడుతున్న ప్రజలు
- కార్తీకమాసం ఎఫెక్ట్‌తో మరింత ప్రియం

జగదాంబ: కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కొత్తిమీర నుండి ఉల్లిపాయల వరకు ఏ ఒక్కటీ అందుబాటులో లేకపోవడంతో సాధారణ ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. రూ. 500 తీసుకుని మార్కెట్‌కు వెళ్తే కనీసం సంచి సగం కూడా నిండడం లేదని ఆవేదన చెందుతున్నారు. నగరంలో ఇతర ప్రాంతాల్లో అయితే కనీసం కంటితుడుపు చర్యగా రైతుబజార్లు అయినా ఉన్నాయి. పాతనగరంలో ఒక్క రైతుబజారు కూడా లేకపోవడంతో ధరల దరువు నడుమే ప్రజలు కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం జూలై , ఆగస్టు నెలల్లో కూరగాయల ధరలు పెడగడం మామూలే అయినప్పటికీ ఈ ఏడాది మరీ ఇంత దారుణంగా పెరగడంతో కొనుక్కుని తినే పరిస్థితులు లేవని వినియోగదారులు వాపోతున్నారు.

ఈ వారం పూర్ణామార్కెట్‌లో కూరగాయల ధరలు కిలోల లెక్కన

వంకాయలు	రూ. 40	బెండకాయలు	రూ.60
నల్లవంకాయలు	రూ. 50	దొండకాయలు	రూ.40
టమాటాలు	రూ. 50 నుంచి రూ. 60	పొటల్స్	రూ.50
ఉల్లిపాయలు	రూ. 50	కాలీఫ్లవర్	రూ.70
వెల్లుల్లి	రూ. 350	క్యాబేజీ	రూ. 40
అల్లం	రూ.70	క్యారెట్	రూ. 50
పచ్చిమిర్చి	రూ. 50	బీట్‌రూట్	రూ. 40
క్యాప్సికం	రూ.70	సీమదుంపలు	రూ. 40
బీరకాయలు	రూ.50	బంగాళాదుంపలు	రూ. 40
చిక్కుడుకాయలు	రూ. 70	అనపకాయలు	రూ. 30
గోరుచిక్కుడుకాయలు	రూ. 50	ములక్కాడ (మూడు)	రూ. 30
బీన్స్	రూ. 100 నుంచి రూ.150	కొత్తిమీర	రూ. 20


పూర్ణామార్కెట్‌లో కూరగాయల విక్రయం

మాలధారులు.. అన్నసమారాధనలు..

కార్తీకమాసం అంటేనే ఎంతో పవిత్రమైన మాసం . ఈ మాసంలో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక సిరులు ద్యోతకమవుతుంటాయి. ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతుంటాయి. ఈ నేపథ్యంలో అనేక చోట్ల మాలధారులకు భారీ ఎత్తున అన్నసమారాధన కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఈ కారణంగా కూడా కూరగాయల ధరలు పెరుగుతున్నాయి అని చెప్పొచ్చు. ఏదిఏమైనా భారీగా పెరిగిన కాయగూరల ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు సంతృప్తిగా కూరగాయలు కొనుక్కుని తినలేకపోతున్నారు.

కార్తీకమాసం ప్రభావం..

కూరగాయల ధరల పెరుగుదలపై కార్తీక మాసం ప్రభావం కూడా ఉందని చెప్పాలి. ఈ మాసంలో చాలా మంది మాంసాహారం తినరు. పూర్తి శాఖాహారమే తీసుకుంటారు. దీనివల్ల కూరగాయలు కొనుగోలు చేసేవారి సంఖ్య పెరుగుతుంది. దానివల్ల కూడా ధరలు పెరుగుతున్నాయి.

అల్లం.. వెల్లుల్లి కొనలేకపోతున్నాం..



అల్లం, వెల్లుల్లి వంటివి కొనలేకపోతున్నాం. వాటి ధరలు ఊహించనంతగా పెరిగాయి. ఏ కూరగాయ ధర చూసుకున్నా అందుబాటులో లేదు. చాలా రకాల కూరగాయల ధరలు నాన్‌వెజ్‌తో సమానంగా పెరిగిపోయాయి. ఇలా అయితే పేద, మధ్య తరగతి ప్రజలు ఎలా బతగ్గలరు? ప్రభుత్వం ధరల నియంత్రణకు ఏదైనా చేయాలి.

– ఉమ, పాతనగరం

రూ. 500కి ఏమీ రావడంలేదు..



గతంలో రెండు వందలు బజారుకు తీసుకెళ్తే సంచి నిండిపోయేది. ఇప్పుడు రూ. 500 తీసుకెళ్లినా సగం సంచి కూడా నిండడం లేదు. కేవలం ఉల్లిపాయలు, టమాటాలు మాత్రమే వస్తున్నాయి. ఏ కూర చూసినా రూ. 50కి తక్కువ లేదు. పచ్చి మిర్చి ధర కూడా పెరిగిపోయింది. పేదలకు అందుబాటులో ధరలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– రాజు, పాతనగరం

మర్యాదపూర్వక కలయిక


విజయసాయిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త విజయసాయిరెడ్డిని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. విశాఖలో జరిగిన ఓ కార్యక్రమంలో నూతనంగా ఉత్తరాంధ్ర జిల్లాలకు ఇన్‌చార్జిగా విజయసాయిరెడ్డి నియమితులైన సందర్భంగా వాసుపల్లి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర రాష్ట్ర రాజకీయాల పట్ల కాసేపు ముచ్చటించారు. వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం, పార్టీ అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణ వంటి విషయాలపై చర్చించారు.

క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు సూచించారు. గురువారం రేసవానిపాలెంలో ఉన్న డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సత్యం జంక్షన్ కూడలి మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు నర్సింగ్ స్టూడెంట్లు, సిబ్బందితో కలిసి కాన్సర్ అవగాహన ర్యాలీని డీఎంహెచ్‌వో జెండా ఊపి ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు పరీక్ష – క్యాన్సర్ నుంచి రక్ష-క్యాన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యమని, అలాగే 18 సంవత్సరాలు పైబడిన వారందరూ తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకోవాలన్నారు. మీ ఇంటి వద్దనే ఆరోగ్య సిబ్బంది వచ్చి స్క్రీనింగ్స్ చేస్తారని అన్నారు . ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలి అని పేర్కొన్నారు. ఈ ర్యాలీలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వైద్యులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలకు వాసవీ క్లబ్ వితరణ


విద్యార్థులు, అధ్యాపకులతో వాసవీక్లబ్ (స్మార్ట్ విశాఖ) ప్రతినిధులు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు వాసవీక్లబ్ (స్మార్ట్ విశాఖ) ప్రతినిధులు కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో డస్ట్‌బిన్లు, విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ క్యాంపస్ అంతా డస్ట్‌బిన్లు అందుబాటులో ఉంటే వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా ఒకచోట వేయొచ్చన్నారు. వాటిని పునర్వినియోగం చేసేందుకు అవకాశం ఉంటుందని, తద్వారా కళాశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. వాసవీ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ లెఫ్టినెంట్ గవర్నర్ డాక్టర్ కె. గీతాంజలి, వాసవీ క్లబ్(స్మార్ట్ విశాఖ) గవర్నర్ ఎ. గుప్త, ప్రెసిడెంట్ వీఎస్ గ్రంథి దేవి, సెక్రటరీ కె. కృష్ణ, జోన్ చైర్మన్ కె. మల్లేశ్వరరావు, ఎస్. నారాయణమూర్తి, తిరుపతిరావు, పలువురు ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

ప్రజలకు చిత్తశుద్ధితో సేవలందించాలి

సచివాలయ కార్యదర్శులతో జీవీఎంసీ కమిషనర్


సచివాలయ కేంద్రాన్ని పరిశీలించి ప్రజా సేవలపై ఆరా తీస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ జోన్–4 పరిధిలో గల టీఎస్సార్ కాంప్లెక్ మొదటి, రెండవ అంతస్తులో ఉన్న 2 సచివాలయ కేంద్రాలను అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ముందుగా మొదటి అంతస్తులో ఉన్న 214, 230 సచివాలయ కేంద్రాలను పరిశీలించి, అందులో సిబ్బంది పనితీరు, రోజుకి ఎంత మంది ప్రజలు సచివాలయ సేవలు పొందుతున్నారు అనే అంశాలపై ఆరా తీశారు. ప్రజలకు సేవలందిచడంలో వార్డు కార్యదర్శులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాస్ ప్రసాద్, యూసీడీ డీపీవో ఎంవీడీ ఫణిరామ్, ఏసీపీ ఝూన్సీలక్ష్మి, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రమేష్ పోరాటం స్ఫూర్తిదాయకం


రమేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దాబాగార్డెన్స్: కార్మిక హక్కుల రక్షణ కోసం రమేష్ పోరాట స్ఫూర్తితో ప్రజా, కార్మిక ఉద్యమాలు నిర్వహించాలని సిటు విశాఖ జిల్లా పిలుపునిచ్చింది. ఉమ్మడి విశాఖ జిల్లా సిటు ప్రధాన కార్యదర్శి ఎస్. రమేష్ 7వ వర్ధంతి గురువారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌కు పలువురు నాయకులు నివాళులర్పించారు. సిటు విశాఖ జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్, జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి. గంగారావు మాట్లాడుతూ రమేష్ పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే విద్యార్థి సంఘంలో చురుగ్గా పాల్గొనేవాడని చెప్పారు. రమేష్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని, గొప్ప కళాకారుడని, మంచి ఉపన్యాసకుడని తెలిపారు. విశాఖ జిల్లాలో చిట్టివలస జ్యూట్ మిల్లు, హెట్రో డ్రగ్స్, ఏజెన్సీలో కాఫీ వర్కర్ల సమస్యలపై, బ్రాండిక్స్ కార్మికుల సమస్యలు, జీడిపిక్కల కార్మికులు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్ల సమస్యలపై నిర్వహించిన పోరాటాల్లో పాల్గొన్నారని తెలిపారు. మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలు రద్దు చేయడం, లేబర్ కోడ్స్ తీసుకురావడం, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ, కనీస వేతనాలు ఇవ్వకపోవడం వంటివి జరుగుతున్న సమయంలో రమేష్ వంటి నాయకులు లేకపోవడం ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌కేఎస్‌వీ కుమార్, పి. మణి, జగన్, వెంకట్‌రెడ్డి, జ్యోతీశ్వరరావు, రామస్వామి, కుమార మంగళం, రాజు, సుబ్బారావు, సీత, అప్పలరాజు, ఐద్వా నాయకులు బి. పద్మ, ఈశ్వరమ్మ, ఎల్‌జే నాయుడు, యూఎస్ఎన్ రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నర్సులతోనే కేజీహెచ్‌కు గౌరవం


మాట్లాడుతున్న డాక్టర్ శివానంద్

మహారాణిపేట: ప్రభుత్వ నర్సుల సేవల కారణంగానే కేజీహెచ్‌కు గౌరవం పెరుగుతోందని సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ అన్నారు. జిల్లా ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికల తర్వాత మొదటి సర్వ సభ్య సమావేశం గురువారం ఆంధ్ర వైద్య కళాశాల సమావేశ మందిరంలో జిల్లా అధ్యక్షురాలు గంగా భవానీ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ నర్సుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ కేజీహెచ్ అంటేనే అందరికీ నర్సింగ్ సేవలు గుర్తుకొస్తాయని పేర్కొన్నారు. జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు కె. ఈశ్వరరావు మాట్లాడుతూ నర్సుల సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే జేఏసీలో చర్చించి వాటి పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగా భవానీ మాట్లాడుతూ తమ పానెల్‌ను విశ్వసించి భారీ మెజార్టీ అందించిన నర్సులందరికీ కృతజ్ఞతలు చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రభుత్వ నర్సులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మాజీ అధ్యక్షురాలు భూతం భాగ్యలక్ష్మి మాట్లాడుతూ క్లిష్ట సమస్యలు తలెత్తినప్పుడు రిటైర్డ్ అయిన సీనియర్ నర్సుల సేవలను వినియోగించుకోవాలని, అందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా కార్యదర్శి జీవీఎస్ వరలక్ష్మి, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, ఎన్జీవో సంఘం జిల్లా కార్యదర్శి రవి శంకర్, నగర అధ్యక్షుడు నారాయణరావు, ల్యాబ్ టెక్నీషియన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, మెడికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం అప్పారావు, జిల్లా ప్రభుత్వ నర్సుల సంఘం ఉపాధ్యక్షురాలు ఇందిర, కోశాధికారి వంశీ, కార్యవర్గ సభ్యులు గౌరి, లిల్లీ గ్రేస్, పద్మజ, వినీల తదితరులు పాల్గొన్నారు.

గౌరీ సంఘం సేవలు నిరుపమానం


అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు, గ్రంథాలయ సభ్యులు

అల్లిపురం: వేంకటేశ్వరమెట్ట, శ్రీ వేంకట గౌరీ శంకర గ్రంథాలయం, గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గ్రంథాలయం ఆవరణలో అయ్యప్పలకు గురువారం నుంచి భిక్ష కార్యక్రమం ప్రారంభించారు. కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పీవీ రమణమూర్తి పాల్గొని భిక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. అయ్యప్పలకు నెల రోజుల పాటు నిరంతరాయంగా భిక్ష చేపట్టడం వారి సేవా నిరతికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రంథాలయ అధ్యక్షుడు పాలమరశెట్టి శ్యామ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పాలమరశెట్టి శ్రీను, సూరిశెట్టి చిట్టినాయుడు, పీల వెంకట అప్పలనాయుడు, శరగడం భాస్కరరావు, భీశెట్టి గోపీకృష్ణ తదితరులు స్వాగతం పలికి అమ్మవారి ప్రసాదం అందజేశారు. గౌరీ సేవా సంఘం కార్యదర్శి పాలమరశెట్టి శ్రీను తదితరులు మాట్లాడుతూ గత 33 సంవత్సరాలుగా అమ్మవారి సన్నిధిలో నెల రోజుల పాటు అయ్యప్పలు, భవానీలు, ఇతర మాలధారులకు అన్నసమారాధన చేస్తున్నామని తెలిపారు. మాలధారులు ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.

సర్ సీవీ రామన్‌కు ఘన నివాళి

దాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో గురువారం ఆ కళాశాల పూర్వ విద్యార్థి, నోబుల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్ 136వ జయంతి కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు నేతృత్వంలో నిర్వహించారు. కార్యక్రమంలో అతిథిగా డాక్టర్ ఎస్. మల్లాది శివరాం, సతీమణి డాక్టర్ ఎస్. ద్యూతీ, ఏయూ భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, ఏయూ మాజీ బోటనీ విభాగాధిపతి బి. రామకృష్ణ పాల్గొని సీవీ రామన్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లాది శివరాం మాట్లాడుతూ విద్యార్థులకు భౌతిక శాస్త్రం మంచి భవిష్యత్ ఇస్తుందని, కాలం, గెలుపు, ఓటములు మూడు అంశాల గురించి విద్యార్థులకు తెలిపారు. డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్ సీవీ రామన్ ఎఫెక్ట్ గురించి విద్యార్థులకు వివరించారు. దేశ భవిష్యత్‌కు భౌతిక శాస్త్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. బి. రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకుని, ఆయన అడుగు జాడల్లో నడిస్తే దేశ భవిష్యత్ ఉన్నత స్థానంలో ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు మాట్లాడుతూ మానవ మనుగడలో భౌతికశాస్త్రం ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు. సర్ సీవీ రామన్ జయంతి సందర్భంగా వివిధ పోటీల్లో చురుగ్గా పాల్గొన్న విద్యార్థులను, రామన్ జయంతి ఘనంగా నిర్వహించిన నిర్వాహకులను కళాశాల కరస్పాండెంట్ అదీప్ భానోజీరావు అభినందించారు.


మాట్లాడుతున్న డాక్టర్ మల్లాది శివరాం

అనంతరం కళాశాలలో గత రెండు రోజులుగా నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డీన్ శంకర్ నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, స్వరాజ్యలక్ష్మి, గాంధీ, భౌతికశాస్త్ర విభాగాధిపతి డి. సంతోష్‌కుమార్ ఇతర అధ్యాపకులు, అధిక సంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వినికిడి సమస్యలపై ఉచిత వైద్య శిబిరం


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: వినికిడి సమస్యతో బాధపడుతున్న వారికి గురువారం కేజీహెచ్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో మొత్తం 130 మంది పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి పలువురు హాజరయ్యారు. వీరికి ఆడియో మెట్రీషియాన్ పరీక్షలు నిర్వహించి వినికిడి సమస్య ఉన్న వారిని గుర్తించారు. వారికి త్వరలో అవసరమైన చికిత్స చేసి వినికిడి పరికరాలు అందజేస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, దీన్‌దయాళ్ శ్రవణ ఫౌండేషన్ ప్రతినిధి బి.రవితేజ, వైద్య ఆరోగ్యశాఖకు చెందిన డాక్టర్ సమత, డాక్టర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

17న క్రీస్తు రక్షకుని యాత్రా మహోత్సవం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విచారణ గురువులు

కంచరపాలెం: క్రీస్తు రక్షకుని యాత్రా మహోత్సవాలు ఈ నెల 17న జ్ఞానాపురం రక్షణగిరి పుణ్యక్షేత్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు విశాఖ అర్చ్ డయాసిస్ వికార్ జనరల్ రెవరెండ్ ఫాదర్ డి. బాలశౌరి, రక్షణగిరి డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ క్యాథడ్రల్ కార్యాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 8 నుండి 16 వరకు నవదిన ప్రార్థనలు జరగనున్నాయని వెల్లడించారు. రక్షకుని యాత్రా మహోత్సవంలో విశాఖ ప్రావిన్స్ నుంచి వెరీ రెవరెండ్ ఫాదర్ భవిరి సురేష్‌బాబు ఆంగ్లంలో పవిత్ర ఆరాధన బోధన, విశాఖ అగ్రపీఠ నూతన గురువులు, ఇతరులచే తెలుగులో సమష్టి దివ్య పూజబలి జరుగుతుందన్నారు. 17 సాయంత్రం ప్రధాన పండగలో విశాఖ అగ్రపీఠ పాలనాధికారి, ఏలూరు పీఠాధిపతులు జయరావుచే సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ నుంచి రక్షణగిరి వరకు ప్రదక్షిణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సహాయ విచారణ గురువులు ఫాదర్ బి.వినయ్‌కుమార్, పి. ఆంథోనీ రాజ్, పీపీసీ అధ్యక్షుడు రాజేష్, సభ్యులు రత్నం, ఫ్రాన్సిస్, ఐతి రవికుమార్, విజయ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సాయంతో కుటుంబం చెంతకు బాలిక


బాలికను తల్లికి అప్పగిస్తున్న పోలీసు

విశాఖ సిటీ: మనస్పర్థల కారణంగా అలిగి ఇంటి నుంచి పారిపోయి వచ్చిన చింతపల్లికి చెందిన బాలికను పోలీసులు గురువారం మళ్లీ కుటుంబ సభ్యులకు అప్పగించారు. చింతపల్లి మండలానికి చెందిన 14 ఏళ్ల బాలిక కుటుంబ సభ్యులపై అలిగి ఇంటి నుంచి పారిపోయి నగరానికి వచ్చేసింది. అర్ధరాత్రి పాత్ జైలు రోడ్డులో ఒంటరిగా తిరుగుతున్నట్లు గమనించిన ఒక వ్యక్తి 112కు కాల్ చేసి సమాచారం అందించాడు. దీంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని బాలికను టీఎస్సార్ కాంప్లెక్స్‌లో ఉన్న నైట్‌షెల్టర్‌లో ఉంచారు. ఆమె తల్లికి సమాచారం అందించారు. గురువారం ఆమె నగరానికి రావడంతో బాలికను తల్లికి అప్పగించారు.

ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం ప్రజాపోరు

దాబాగార్డెన్స్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం విశాఖ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 14 వరకు ప్రజాపోరు నిర్వహించనుంది. ఈ మేరకు గురువారం సీపీఎం విశాఖ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్, జిల్లా నాయకుడు డాక్టర్ బి. గంగారావు, బి. జగన్, పి. మణి, వి. కృష్ణారావుతో కలిసి ప్రజాపోరు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు ధరలు అదుపు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని, ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ చర్యలు వేగవంతం చేయడంతో పాటు విద్యుత్ భారం భారీగా పెంచాయన్నారు. ఉచిత ఇసుక అమలు, ఖాళీ పోస్టుల భర్తీ, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, లేబర్‌కోడ్స్ రద్దు తదితర డిమాండ్లతో ప్రజాపోరు ఉంటుందన్నారు. వారం రోజుల పాటు ప్రతి ఇంటికి వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాల కరపత్రాలు పంపిణీ, చేపట్టి 14న ఎమ్మార్వో కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం. జగ్గునాయుడు తదితరులు పాల్గొన్నారు.